ఓంశ్రీసాయిరాం

విశ్వమందు విభుడు వెలుగుచునుండును
విభునియందు వెలుగు విశ్వమెపుడు
విశ్వవిభుల మైత్రి విడదీయరానిది
సత్యరత్నాలమూట ఈ సాయి మాట.

విద్యార్థులారా! అధ్యాపకులారా! డాక్టర్సు!

విశ్వమంతయు ఒక నాటక రంగము. ప్రతి వ్యక్తి ఈ రంగమునందు ఒక యాక్టరు. ఈ యాక్టరు ఏవిధంగా వుండాలి? కర్తవ్యము నిర్వర్తించటమే యాక్టరుయొక్క ప్రధానమైన లక్ష్యముగా వుండాలి. తన వ్యక్తిత్వము ప్రక్కన పెట్టాలి. ఏవిధంగా? మీరు గడచిన పండుగరోజు డ్రామా చూశారు. ఒకడు మునిసిపల్ ఛైర్‌మన్‌గా వేశాడు. మునిసిపల్ ఛైర్‌మన్‌గా వేసినప్పుడు మునిసిపల్ ఛైర్‌మన్‌గా యాక్టు టేయాలిగానీ దీపక్‌ఆనంద్‌గా యాక్టు చేయటానికి వీలులేదు. దీపక్ ఆనంద్ అనే తన వ్యక్తిత్వమును ప్రక్కన పెట్టాలి. నీ కర్తవ్యమనే నాట్యము ప్రదర్శించాలి. అయితే ఈ నాటకమునకు ఎవరు డైరక్టరు? అంతా దైవసంకల్పమే దీనికి మూలకారణము. ప్రతి మానవుడు దైవసంకల్పముచేత ఆవిర్భవించినవాడే. తన కర్తవ్యమును నిర్వర్తించే నిమిత్తమై మానవుడుగా జన్మించాడు. అయితే ఈ మానవత్వమును ప్రకటించాలి, ప్రదర్శించాలిగానీ తన కర్తవ్యమును యేమాత్రమూ ప్రకటించటానికి వీలుకాదు. కనుక, మంచైనా, చెడ్డైనా కథకు కారణమైనవాడు భగవంతుడే. కనుక, తన సంకల్పములను చక్కగా నిర్వర్తించటమే ప్రతి వ్యక్తియొక్క కర్తవ్యము. ఇలాంటి కర్తవ్యమును దృష్టియందుంచుకొని, మానవుడు తన వ్యక్తిత్వము ప్రక్కకు నెట్టి, జీవితములో ఈ జగత్తనే నాటకరంగమందు తన యాక్టును చక్కని ఆదర్శముతో ప్రదర్శించాలి.

అయితే ఈ నాటకమందు మంచి చెడ్డలు రెండూ కూడివుంటాయి. ఈ రెండింటికి మధ్య మానవత్వము వికసిస్తూ వుంటుంది. ఈ రెండూ ఏమిటి? ఒకటి మారకము, రెండవది తారకము. మారకమనగా ఏదీ నాది కాదు. ఏ డ్రామాలో ఎలాంటి యాక్టు చేస్తున్నప్పటికి, ఎలాంటి పదములు పలుకుతున్నప్పటికి ఇవన్నీ డైరెక్టరుయొక్క సంకల్పములే. ఏదియు నాదికాదు అని సర్వమూ త్యజించి ఆ నాటకమునకు సంబంధించిన కథను మాత్రమే లక్ష్యమునందు వుంచుకొని తాను యాక్టు చేయటము మారకము. తారకమునుక మారకమునకు వున్న వ్యత్యాసము ఒక్కటే. మారకమనేది నాది కాదు అని త్యజించి ఆ సంకల్పమునకు మూలకారణమైన భగవంతుని సంకల్పమును దృష్టియందుంచుకొని ఆడటమే మారకము. కానీ, అంతయూ నాదే, నేను చేస్తున్నాను, నేను ఈవిధంగా యాక్టు చేస్తున్నాను, ఇదంతా నాకు సంబంధించినదే అనే మమత్వము పెంచుకొని యాక్టు చేయటం తారకము. ఒక చిన్న ఉదాహరణము. మన కాలేజీలో ప్రిన్సిపాల్ వుంటాడు. ఈ కాలేజీయందు అన్ని రంగములందుండిన పదార్థములు, మిషనులు, క్లాసులలోని డస్కులు, ఛైర్సు అన్నింటికి తానే అధికారిగా వుంటాడు. అన్నింటియందు అతి జాగ్రత్తను వహించి సంరక్షిస్తూ వుంటాడు. కానీ, ఆ ప్రన్సిపాల్ స్థానమునుండి రిటైర్ అయిన తరువాత దానిని చూచి ఏమాత్రమూ విచారించడు. కారణం ఏమిటి? ఇది నాది కాదు. నేనుండినంత వరకు కర్తవ్యముగా నిర్వర్తించి కాపాడుకోటం నా విధి. రిటైర్ అయిన తర్వాత ఇంటికి వెడుతున్నానని డెస్కులన్నీ విడిచి పెడుతున్నానే, లోబరెటరీ మిషన్లు వదలి వెడుతున్నానే అనే విచారణకు యేమాత్రమూ అవకాశము వుండదు. అదే ప్రిన్సిపాల్ ఒక ఇంటిలో బాడుగకు వుండి రిటైర్ అయిన తర్వాత ఆ ఇల్లు వదిలి తన స్వంత ఇంటికి వెళ్ళే సమయంలో తనవైనవి అన్నింటినీ ప్యాక్ చేసి లారీలో వుంచుతాడు. పాత చెప్పులుకూడా చుట్టి లారీలో వేస్తాడు. కారణం ఏమిటి? ఆ చెప్పులు నావి అనే మమత్వంచేత వాటిని ప్యాక్ చేసి తన వెంట తీసుకు వెడతాడు. అంతకంటె ఎంతో విలువైన సామాను కాలేజీలో వుండినప్పటికి వాటిని వదలి వెళ్ళే సమయంలో ఏమాత్రమూ విచారించడు. మారకమనగా తన కర్తవ్యమును నిర్వర్తించి సామాను కాపాడుకోటం. అక్కడ మమత్వం ఏమాత్రమూ వుండదు. విలువైనదైనా, విలువకానిదైనా వాటిపై తన ప్రభావము ఏమాత్రం వుండదు. మమత్వము లేనిది మారకము. న..మమ అది నిజమైన మారకము. మమ అనేది

తారకము. అదేవిధముగా ఈనాటి మానవుడు ప్రతి చిన్న విషయమును మమత్వము చేత పెంచుకొని పనికిమాలినవి కూడా తలపైన వేసుకొని కాలమును, కర్మమును, కర్తవ్యమును తాను విస్మరించి వాటి నిమిత్తమై తాను అనేకవిధములుగా ప్రాకులాడుతున్నాడు. మారకమనగా మమత్వము లేనిది. మమత్వంతో కూడినదే తారకము. మనస్సు విషయములపై ప్రసరింపచేసినప్పుడు బంధితమవుతుంది. ఈ నేగిటివ్స్‌పై మనస్సు పెట్టుకొని దాని నిమిత్తమై ప్రాకులాడటము కేవలం తారకమవుతుంది. ఎంత విలువైనవో తనయందున్నప్పటికి వాటిని త్యజించి ఈవిధమైన పాటుపడుతుంటాడు మమత్వముతో కూడినవాడు.

విలువలేని ఇనుప పెట్టె ఈ దేహము. ఇలాంటి దీనిలో విలువ కల్గిన నగలన్నీ పెడుతున్నాము. పెట్టెకా విలువ? నగలకా విలువ? విలువైనవి నగలే. దాచబడేది ప్రధానమా? దేనిలో దాస్తున్నామో అది ప్రధానమా? ఈ దేహము దేవాలయము వంటిది. ఇందులోనున్న విభుడే వజ్రము వంటివాడు. మనయందు నిత్యసత్యమై నిరంతరమూ మనలను సరైన మార్గమున నడిపించేది సదసత్. ఇలాంటి వాటిని మనము ఈనాడు విస్మరించి విలువలేని ఈ భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన, అనిత్యమైన పదార్థములకు మనం ప్రాకులాడుతున్నాము. కనుకనే, మానవుడు ఇన్న బంధనలకు చేరి తాను బాధలకు గురౌతున్నాడు. దీనికి కారణం ఏమిటి? అంతఃకరణ చతురింద్రియములే మూల కారణము మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. కన్నులు దేనినైనా చూడాలని ఆశిస్తున్నాయి. చూడటం దాని లక్షణమే. కానీ, ఎలాంటివి చూడాలని మనం విచారించటం లేదు. కన్నులున్నవి కదాయని ఊరికే చూడటం మన లక్ష్యముగా వున్నది. కానీ, ఎలాంటి దానిని చూడాలి? చెవులకు వినటం అభిరుచి. ఎలాంటి దానిని వినాలి అనే ప్రశ్న వేసుకోటం లేదు. తినటం నోటికి లక్షణమే. కానీ, ఏమి తినాలి అని విచారించటం లేదు. వాసన చూడటం ముక్కుయొక్క లక్షణమే. కానీ, ఎలాంటిది వాసన చూడాలి? చేతితో తాకటము దీని లక్షణమే. కానీ, దేనిని తాకాలి, దేనిని తాకకూడదు అనే విచారణ దీనికి విరుద్ధమైనది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు ఈ పంచేంద్రియములయొక్క లక్షణములు ప్రధానమైనవి మానవునకు. ఈ పంచేంద్రియములయొక్క లక్షణములచేత మానవుడు పాపమునకు గురౌతున్నాడు. ఈ పాపమునుంచి తాను విముక్తుడు కావాలి. ఏవిధంగా విముక్తుడు కావటానికి వీలవుతుంది? నీవు చూడవలసింది చూడు. వినవలసింది విను. తినవలసింది తిను. వాసన చూడవలసింది చూడు. అదే నేను అప్పుడప్పుడు చెబుతాను.

see no evil, see what is good
talk no evil, talk what is good
hear no evil, hear what is good
do no evil, do what is good
think no evil, think what is good.

ఈ పదములు చాలా చిన్నవిగా వుంటున్నాయిగానీ ఇందులోనే సర్వబంధములూ చేరివుంటున్నాయి.

బంధనే మానవునికి నిజమైన పెనుభూతము. ఈ పెనుభూతమునుండి తప్పించుకొని, నిర్బంధమునుండి పోయి సంబంధము కల్పించుకోవాలి. కనుక, బంధవిముక్తులకు మనస్సే మూలకారణము. మనస్సు అన్నింటినీ కోరుతుంది. కోరిన దానిని విషయమా, విషమా అని మనం విచారించటం లేదు. విషయములన్నీ విషముతో సమానమే. ఈ మనస్సును విషయములపై పోనివ్వకుండా చూచుకోవాలి. ఒకవేళ పోయినప్పుడు అందులో ఉత్తమమైన దానిని ఆకర్షించుకోవాలి. ముక్కుతో వాసన చూస్తున్నాము. సుగంధాన్ని మాత్రమే టూడాలని ఆశిస్తున్నాం. కానీ, సుగంధముతో పాటు ప్రాణవాయువును కూడా ఉచ్ఛ్వాసనిశ్వాసములతో ఆకర్షించాలి. ఆకలి తీరటానికి అన్నముకూడా ఆరోగ్యమునందించే అన్నముగా మనం భుజించాలి. అదేవిధముగా వినవలసింది వింటున్నాం. టి.వి.లోనో, రేడియోలోనో పిచ్చిపిచ్చి విషయాలంతా వింటున్నాం. ఇది కాదు. హృదయాన్ని ఆనందపరచే విషయాన్ని వినాలి. అంతఃకరణకు ఆనందమిచ్చే విషయాన్నే మనం వినాలి. అదే అంతఃకరణ తత్త్వముయొక్క విచారణ. దీనినే మనము నెగిటివ్, పోజిటివ్ అని పెట్టుకుంటూ వచ్చాం. నెగిటివ్ మనకు

అనవసరమైనది. అనవసరమైన వాటినంతా వింటున్నాం. ఆ నెగిటివ్ మనలో చేరిన తరువాత అనేకరకములైన బాధలు వెంటాడుతూ వస్తున్నాయి. ఈనాడు మానవుడు ఆశించేదంతా పోజిటివ్. కానీ, హృదయము నిండుకు నింపుకున్నది నెగిటివ్స్. హృదయము నిండుకు నెగిటివ్స్ నింపుకొని పోజిటివ్స్ కావాలంటే ఎలా లభ్యమౌతాయి? దీనికి చిన్న ఉదాహరణ. పిల్లలు పాడుతున్నారు. నిత్యము అనేక కొత్త ట్యూన్స్ వేసి పడుతున్నారు. ట్యూన్స్ చూస్తుంటే ఒక్కొక్క పాటకు నూతనమైన ఉత్తేజంగా కనిపిస్తుంలియి. ఉత్తేజమైన రాగములచేత, ఉత్సాహమైన మనస్సుచేత ఈ పాటలు, భజనలు సల్పుతున్నారు. ట్యూన్స్ ఆకర్షణీయంగా వుంటున్నాయి. పదములు చాలా ఆనందమైనవిగా వుంటున్నాయి. విషయము చూస్తే చాలా ఆనందకరమైనదిగా కనిపిస్తున్నాది. కానీ, హృదయము ఎట్లుంది? హృదయములోని భావములు మృగభావములుగా మనకు తోస్తుంటాయి. లోపల భావములు మృగభావములు. లోపల భావములు పశుభావములు. లోపల భావములు దుష్టభావములు. లోపల దుష్టభావములు, పశుభావములు, మృగభావములు వుంచుకొని పైన ఎన్నివిధములైన భజనలు సల్పినా ఆకర్షణీయమౌతుందా? బయట రాగములు, బయట తాళములు ఇవన్నీ కేవలం నెగిటివ్‌తో కూడినవే. లోపల భావములు పరిశుద్ధమై, పరిపూర్ణమై, ఆనందమై స్వార్థరహితమై వుండినటువంటిదే పోజిటివ్. కనుక, పోజిటివ్‌ను అభివృద్ధిపరచుకొనుటకు ప్రయత్నించేయాలిగానీ నెగిటివ్ వల్ల వచ్చే ఫలితము ఏమీలేదు. ఈనాడు ప్రతి మానవుడు నెగిటివ్ వైపునే లక్ష్యముంచి పోజిటివ్‌ను విస్మరించి తన నిత్యజీవితము జరుపుతున్నాడు. మనస్సుకు సంబంధించిన ప్రతి కర్మ నెగిటివ్. హృదయమునకు సంబంధించిన ప్రతి పని పోజిటివ్. హృదయమునకు సంబంధించినది మనము దినదినమునకు అభివృద్ధి గావించుకోవాలిగానీ దేహమునకు సంబంధిచినది అభివృద్ధిగావించుకోటం గొప్పదనము కాదు.

'జంతూనాం నరజన్మ దుర్లభమ్'. మానవజన్మ భగవంతుని సంకల్పముతో అందుకున్న ఒక ఉత్తమమైన గిఫ్టు. ఇట్టి భగవంతునినుండి అందుకున్న గిఫ్టు ఎంత చక్కగా మనము ఉపయోగించుకోవాలి! ఎంత భద్రముగా దీన్ని చూచుకోవాలి. ఎంత పవిత్రమైనదిగా దీనిని చూచుకోవాలి! ఎంత సార్థకమైనదిగా దీనిని అనుభవించాలి! ఆ పోజిటివ్ లక్షణములు మనయందు ఏమాత్రము కనిపించటం లేదు. దేహమున్నది. సత్కర్మలమయమై వుండాలి. శిరస్సు దేనికోసం లభించింది? సచ్చింతనలతో నిండి వుండాలి. హృదయము ఏవిధంగా వుండాలి? పరిపూర్ణమైన దయతో వుండాలి. ఈ దయ హృదయములో లేకుండా, త్యాగభావము శిస్సులో లేకుండా, స్వార్థ రహితమైన కర్మలు చేతిలో లేకుండా ఎన్ని పనులు చేసి ప్రయోజనము ఏమిటి? ఎన్ని యోచనలు చేసి ప్రయోజనం ఏమిటి? ఇవన్నీ పోజిటివ్‌లో జరిగిపోతున్నాయని అనుకుంటున్నాం. కాదు, కాదు. అంతా నెగిటివ్‌తో కూడివుంటున్నాయి. ఏనాడు నీ హృదయము దయతో నిండి వుండునో అదే నీకు నిజమైన పోజిటివ్. ఏ చేతులు స్వార్థరహితమైన కర్మలలో ప్రవేశించునో అదే నీకు నిజమైన పోజిటివ్. ఏ శిరస్సు పవిత్రమైన సచ్చింతనతో వుండునో అదే నిజమైన పోజిటివ్. ఈనాటి విద్యార్థులుగానీ లేక పెద్దలుగానీ నెగిటివ్ విషయాలు గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలి. నాలుక చాలా పవిత్రమైనది. మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణ ఈ నాలుగూ దేనికి సంబంధించినవి? దేహమునకు సంబంధించినవి. దేహముతో కూడినవే ఇంద్రియములు. దేహముతో కూడినదే మనస్సు. దేహముతో కూడినదే బుద్ధి. దేహముతో కూడినదే అంతః కరణ. దేహమే నేను అనే భావము వుండినంత వరకు వీడు న్గిటివ్‌లోనే జీవిస్తుంటాడు. ఈ దేహము నేను కాదనుకున్నప్పుడు ఏ విచారము వుండదు. ఈ ఇంద్రియములకంతా 'నేను' అధిపతిని. నేను మాష్టర్. ఇంద్రియములు పనిముట్లు. master the mind, be a mastermind. ఈరకమైన తత్త్వము మనము గుర్తించుకొని మోక్షమునకు తగిన కృషి చేయాలి. మోక్షము ఎప్పుడో చచ్చిన తర్వాత లభించలేదు. బ్రతికినప్పుడే చిన్నతనమునుండి, అడుగడునకు మనము ఈ లిబరేషన్ గుర్తిస్తూ పోవాలి. దీనినే ఫ్రీడమ్ అని చెబుతూ వచ్చారు. మోక్షమునకు సరైన పదమును వుపయోగించాలంటే emancipation అదే నిజమైన ముక్తి. దీనికే మనం ఇన్నివిధములైన పేర్లు పెట్టుకుంటున్నాం. మనం పొందవలసినది ఏమిటి? ఫ్రీడమ్. ఏమిటి ఫ్రీడమ్ అంటే? స్వేచ్ఛగా సంచరించటమనుకుంటున్నాం. ఫ్రీడమ్

అంటే బంధరహితుడై వుండటమే. ఎలాంటి బంధన మనకు వుండకూడదు. సర్వ కర్మలు ఆచరించు. కానీ, వాటితో attachment పెట్టుకోవద్దు. అదే నిజమైన పోజిటివ్.

ఈనాడు attachment చేత సర్వకర్మలు ఆచరిస్తున్నాము. attachment లేకుండా ఏ చిన్న పని చేయటానికి పూనుకోము. ప్రతి విషయమందు ఒక attachment దృష్టియందుంచుకొనే దానిని ఆశిస్తున్నాం. నీవు 10వ తరగతి అయిన తర్వాత ఏమిచేస్తావు అని అడిగితే నేను ఇంజనీరింగు చదవాలి కనుక మేథమేటిక్సు దృష్టిలో పెట్టుకున్నాను అంటాడు. డాక్టరు కావాలి కాబట్టి శియోసైన్సు తీసుకుంటాను అంటాడు. అనగా తన భవిష్యత్తునంతా ఈనాడే నిర్ణయించుకొని bondage కి గురైపోతున్నాడు. శియోసైన్సు తీసుకొని డాక్టరు చదువు. డాక్టరుగా సర్వులకు సహాయము చేయి. అప్పుడు bondage కాదు. డాక్టరు చదవటములో తప్పు లేదు. ఇక్కడ దోషమునకు, దోషరహితమునకు వున్న మర్మమించే. పోజిటివ్, నెగిటివ్‌కు వుండిన సంబంధమించే. దేనినీ వదలనక్కర లేదు. అన్నింటియందు నీవు ప్రవేశించు. కానీ, మమత్వము లేకుండా జీవించు. ఫలితమునకై నీవు జీవితము అంకితము చేయవద్దు. ఈవిధముగా తీసుకున్నప్పుడే పోజిటివ్‌గా తయారౌతుంది. సేవలు చేస్తున్నాం మనము. సమాజ సేవ ఏవిధంగా చేస్తున్నాం? మన వాంఛలు దృష్టియందుంచుకొని సేవలు సల్పుతున్నాము. అదికూడా నెగిటివ్‌గానే రూపొందుతున్నాది. ఎక్కడ నెగిటివ్ వచ్చిందో అక్కడ ఏమాత్రం సంతోషము, సుఖము లభ్యము కాదు. నెగిటివ్ అప్పటికప్పుడు ఆనంధము చేకూరుస్తుందిగానీ శాశ్వతమైన ఆనందము అందించదు. అందుకోసమే శంకరులవారు చెప్పారు, 'మా కురు ధనజనయవ్వన గర్వం' అప్పటికప్పుడే ఆనందముచేకూరుస్తుందిగానీ శాశ్వతానందము అది అందించలేదు. శాశ్వతమైనదాన్ని పొందాలనుకుంటే అన్ని కర్మలు ఆచరించుగానీ దానితో ఏమాత్రము సంబంధము వుండినట్లుగా భావించవద్దు. శరీరము కర్మలాచరించుటకు వచ్చింది. కర్మను చేయి, తప్పు లేదు. అది నెగిటివ్ కాదు. కానీ, కర్మలయందు ఫలితముపై మనస్సు వుంచినప్పుడే బంధన. అప్పుడే అది నెగిటివ్‌గా రూపొందుతుంది. బంధన లేకుండా సర్వ కర్మలు నీవు ఆచరించు. అదంతా పోజిటివ్‌గా తయారౌతుంధి. భగవత్కర్మగానే రూపొందుతుంది. దేవుడు అందించిన ఈ దేహాన్ని సత్కర్మలలో ప్రవేశింపజేసి, రీ పని చేసినా ధైర్యముగానే భావించాలి. ఈ కర్మ నిమిత్తము భగవంతుడు ఈ దేహాన్ని అందించాడు. మంచిగానీ చెడ్డగానీ తన ఆజ్ఞ శిరసావహించటమే కర్తవ్యము. తన వ్యక్తిత్వము పక్కకు నెట్టి కర్తవ్యము నిర్వర్తించటమే నిజమైన పోజిటివ్. కానీ, ఈనాడు అట్లా కాదు. వ్యక్తిత్వమునకు ముందంజ వేస్తున్నాడు. కనుక, సర్వదుఃఖములకు గురౌతున్నాడు. సర్వబంధనలకు గురౌతున్నాడు. సమస్త దుఃఖములచేత తాను కృంగిపోతున్నాడు మానవుడు. కృంగక, పొంగక వుండే స్థితి నిజమైన కర్తవ్యమును నిర్వర్తించటమే. వ్యక్తిత్వము పక్కకు పెట్టు.

అనేక పర్యాయములు మీకు చెబుతూ వుంటాను. పూర్వము నాగయ్య అనే సినిమా యాక్టరు వుండేవాడు. ఆయన త్యాగయ్య వేషము వేశాడు. త్యాగయ్య వేషము వేసి పాట పాడుతుంటే జనము ఆనందము అనుభవించేవారు. త్యాగయ్య అనే పేరు నిలచిపోయిందిగానీ నాగయ్యా అనే పేరు నిర్మూలమైపోయింది. త్యాగయ్య ఎవరు వేశారని ప్రశ్నించినప్పుడు మాత్రము నాగయ్య వేశాడు అని పేరు వస్తుంది. స్టేజిపై యాక్టు చేసే సమయంలో, పాడే సమయంలో త్యాగయ్యేగానీ నాగయ్య కాదు. భౌతికమైన జగత్తు ఒక నాటక రంగము. దానిలో ఆడి లోపల వ్యక్తిత్వము పక్కకు నెట్టాలి. జీవత్వముపై సరైన భద్రతను వుంచుకోవాలి. ఏది నీవు? మనసా నీవు? బుద్ధా నీవు? అంతఃకరణా నీవు? ఈవిధంగా ప్రశ్న వేసుకున్నప్పుడు ఏదీ నీవు కాదు. ఇంక ఎవరు నీవు? నేను నేనే. అదే నిజమైన పోజిటివ్. నేను డాక్టరు, నేను ఇంజనీరు, నేను లెక్చరర్ ఇలాంటివన్నీ తాత్కాలికంగా వచ్చేవ్వీ. ఈ వ్యక్తిత్వము పక్కకు పెట్టాలి. విద్యార్థులు ఈనాటినుండే ప్రయత్నము చేయాలి. చిన్న వయస్సునందే ముక్తి ముక్తియని ఎందుకు బోధిస్తున్నారని తల్లిదండ్రులు కొంతవరకు బాధపడవచ్చు. లిబరేషన్ అంటే చచ్చిపోయిన తర్వాత కలిగే మార్పుకాదు. బ్రతికినప్పుడే ఈ లిబరేషన్‌యొక్క స్థానము మనం అనుభవించాలి. ఏమిటి ఈ లిబరేషన్? విముక్తియే లిబరేషన్. విముక్తి పూర్తి అయిన తరువాతనే ముక్తి. ఫ్రీడమ్ మొట్టమొదటిది. విముక్తి రెండవది. ముక్తి మూడవది. చిన్న ఉదాహరణ.

మొట్టమొదట నీవు విద్యార్థి. తరువాత ఉద్యోగములో ప్రవేశించు. నీకు అప్పుడు జీతము వస్తుంది. అప్పుడు నీవు ఉద్యోగస్తుడవు. ఉద్యోగము అయిన తరువాత రిటైర్ అయిపోతావు. అప్పుడు పెన్షన్ వస్తుంది. ఉద్యోగము చేసే సమయములో పెన్షన్ యివ్వరు. చదివే సమయంలో జీతం యివ్వరు. మొట్టమొదట మనం చదవాలి. విద్యార్థి అయిన తరువాత ఉద్యోగములో ప్రవేశించాలి. ఉద్యోగము సక్రమంగా చేసి తరువాతనే నీకు రిటైర్‌మెంటు వస్తుంది. అప్పుడు పెన్షన్ నీకు అందిస్తారు. సే&'చ్ఛ విద్యార్థి స్థాయి. విముక్తి ఉద్యోగము వంటిది. ముక్తి రిటైర్ అయిన తరువాత పరిస్థితి. అప్పుడు అనుగ్రహమనే పెన్షన్ వస్తుంది. నీవు ఆఫీసుకు పో, ఇంట్లో కూర్చో ఆ పెన్షన్ భగవంతుడిచ్చే అనుగ్రహము.

భగవంతుని దృష్టిలో నాలుగు ముక్తులుంటున్నాయి. సాలోక్యము, సామీప్యము, సారూప్యము, సాయుజ్యము. మొట్టమొదట సాలోక్యము. అనగా, చిన్న వయస్సునందే మొట్టమొదట సాలోక్యములో ప్రవేశించాలి. సా..లోక్యం. ఆ..లోకం. ఏ లోకములో వున్నామంటే చదువు లోకంలో వున్నావీ అంటారు. దైవలోకంలో వున్నాను. అదే నిజమైన సాలోక్యం. దైవత్వము లోపల నా మనస్సు విలీనమైఎది. తరువాత సామీప్యం. అత్యంత సమీపంలో కూర్చున్నాను. మూడవది ఆ రూపమే నేనైపోయాను. అదియే బ్రహ్మవితె బ్రహ్మైవ భవతి. ఏది చింతన చేస్తానో దాని రూపం పొందిపోయాను. నాల్గవది సాయుజ్యం. లీనమైపోయాను. ఈ మూడింటియందు ఈనాటి నుండే ప్రయత్నపూర్వకంగా సాధిస్తూ రావాలి. ఏ పని చేసినా దాని పోజిటివ్ లక్షణములు మనం తీసుకోవాలి. పుస్తకం చదువుతున్నాము. ఏ పుస్తకం చదువుతున్నావు? నా పాఠ్యపుస్తకము చదువుతున్నాను. ఎందుకోసమని? నేను పరీక్ష ప్యాసయ్యేకోసమని. ఇదికూడా ఒక పోజిటివ్. ఇది భగవంతుడిచ్చే పరీక్షలు. ఈ పరీక్షలలో నేను ఉత్తీర్ణుడను కావాలని ఆ భగద్భావము నీవు తలచుకో. కానీ, స్కూలులో ప్యాసయ్యే నిమిత్తము చదువుతున్నానని స్కూలుకు నీకు సంబంధము పెట్టుకోకు. ఏది నీ స్కూలు? సత్సంగమే నీ స్కూలు. దానిలో ఇది పరీక్షగా వుంటున్నాది. ఆ పరీక్షలో నీవు ప్యాసైనప్పుడే సామీప్యం ప్రవేశిస్తుంధి. దేని సామీప్యం? దైవత్వమునకు సామీప్యంలో ప్రవేశిస్తుంది. ఈ సమీప్యమునుండి క్రమక్రమేణా సారూప్యంగా తయారౌతుంది. నేరోమైండ్ పోతుంది. నెగిటివ్ భావాలు పోతాయి. చిన్న ఉదాహరణ. మీరే యోచన టేయండి. పెద్ద కుంభవర్షము కురిసింది. గ్రామము చుట్టూ ఎక్కడ చూచినా నీరు వుంటున్నది. మాట్లాడుతున్నప్పుడు ఏమి చెబుతావు? ఊరు చుట్టూ సముద్రము వలె వుంటున్నాది అంటావు. ఎక్కడ చూచినా నీరు అని. అదియే సామీప్యం. అంతా దైవత్వముగానే రూపొందుతుంది. ఏమి చెప్పినా, ఏమి చేసినా, ఏమి తలచినా, ఏది యిచ్చినా, ఏది పుచ్చుకొన్నా అంతా దైవత్వముగానే వుంటుంది. అదియే నిజమైన సాయుజ్యము. క్రమక్రమేణా చేసే ప్రతి కార్యము దైవకార్యముగానే విశ్వసించాలి.

చిన్న ఉదాహరణ. మీరు ఎం.బి.ఎ.ప్యాస్ చేస్తున్నారు. ఎం.బి.ఎ. దేనికోసం? బ్యాంకులోనో, ఫ్యాక్టరీలోనో చక్కని ఉద్యోగము వస్తుందని భావిస్తున్నారు. అలాంటి దానిని పొందాలనుకుంటే మొట్టమొదటినుండి ప్లాను వేసి అందులో ప్రవేశించాలి. ప్రతి దానికి ప్లాను లేకుండాపోవటానికి వీలులేదు. మొట్టమొదట మాష్టర్‌ప్లాను వేయాలి. జీవితము వచ్చేసింది. ఈ జీవితము సార్థకము చేసుకోవాలి. ఏవిధంగా దీనిని సార్థకము చేసుకోవాలి? పోజిటివ్ కర్మల చేతనే సార్థకము చేసుకోవాలి. నెగిటివ్ కర్మల చేత ఏనాటికీ సార్థకం కాదు. ప్రాచీన కాలమునుండి మన భారతదేశమే కాక అన్ని దేశములవారు మొట్టమొదట జీవితములో జీవించే విధానము గుర్తిస్తారు. మీ పిల్లవాడు ఏమిచేస్తున్నాడని ఎవరైనా ప్రస్నించినప్పుడు మా పిల్లవానిని బాగా చదివిస్తున్నాం. ఎం.బి.ఎ. ప్యాస్ అయిన తర్వాత పెద్ద ఉద్యోగస్తుడౌతాడు. పెద్ద ఇంటివారి బిడ్డను పెండ్లి చేసుకుంటాడు, అని ఈవిధముగా ఎన్నెన్నో ప్లానులు వేస్తుంటారు. ఇలాంటి ప్లానులన్నీ నెగిటివ్ ప్లానులే. దేనికోసం చదివాడు? ఉద్యోగం కోసం. ఉద్యోగం దేనికోసం? పెద్ద జీతం తీసుకోటంకోసం. జీతం ఎంధుకోసమని? ఒంటరి వానికి జీతం ఎంధుకు? కాబట్టి వానికి ఒక బంధన ఏర్పరచాలి. వారికున్న బంధనే కాకుండా వీనికి బంధన ఏర్పరచాలి. దీనికే ఆనాడు బుద్ధుడు చెప్పాడు, 'నా బంధువులు, నా తల్లిదండ్రులు, నా మిత్రులు సర్వులు చేరి నాకు ఒక బంధన కట్టి నన్ను ఈ పాపంలో ముంచిపెట్టారు'

అన్నాడు. ఆ బంధవిమోచన కోసమే నేను ఈనాడు ప్రాకులాడుతున్నాను. ఏమిటి ఈ భంధన ఎవరు చేశారు? తండ్రి శుద్ధోదనుడు. పంఢితులు, 'నీ కుమారుడు గొప్ప యోగిగా తయారౌతాడు' అని చెప్పారని యోగి కాకుండా వుండే నిమిత్తమై అనేకరకములుగా కల్పనలంతా కల్పించి తన భార్య తమ్ముని బిడ్డనిచ్చి పెండ్లిచేశాడు. దేనికోసం? పెండ్లి చేస్తే ఒకవిధమైన మార్గములో వుంటాడు. వైరాగ్యములో ప్రవేశించడు. వైరాగ్యము రాకుండా వుండేకోసము బంధన ఏర్పరచాడు. బంధన దేనికోసం? వైరాగ్యము రాకుండావుండే కోసం. బంధన ఏర్పడిన తరువాత, 'స్వామీ! నాకు బంధవిమోచన చేయండి' అంటారు. కట్టుకొని విమోచన ఏవిధంగా చేయటం? మానవత్వములో ప్రతీదీ ఒక బంధనగా ఏర్పడుతున్నది. తల్లిదండ్రీలను ఎవరినైనా అడగండి, 'మీరు ఎందుకయ్యా విచారిస్తున్నారు?' అని. 'అయ్యో! మా కుమారునికి పెండ్లిచేయాలి. అదొక పెద్ద రెస్పాంసబిలిటీగా వుంది. మాకీ బంధన తీరిపోవాలి' అంటారు. 'పోనీ నీవు పెండ్లి చేసుకున్నావుకదా, నీవు బంధవిముక్తుడుగా వున్నావా? శాంతిసంతోషాలు అనుభవిస్తున్నావా?' అని ఎవరైనా ప్రశ్నిస్తే, 'ఈ సంసారము నాకు వద్దు' అంటారు. తాను నాకీ సంసారము వద్దంటాడు, పిల్లలకు కట్టటానికి ముందంజ వేస్తాడు. ఇది ఎంత ద్రోహము. మీరు యోచన చేయండి. తనకు చెడ్డ, కుమారునికి మంచి అవుతుందా! తనుకు చెడ్డ అయితే కుమారునికి కూడా చెడ్డయే. తనకు మంచి అయితే కుమారునికికూడా మంచే. ఈరకమైన లోకసంబంధమైన బాధ్యతలు పెరిగిపోతూ వస్తున్నాయి. బంధన అనేది పెండ్లి చేసుకోటమనిగానీ, సంసారము కట్టుకోటమనిగానీ, భవనం నిర్మించుకోటంగానీ, ఉద్యోగము చేయటముగానీ యివన్నీ కాదు బంధన. దానిపై మమత్వము పెంచుకోటమే బంధన. తిరిగాడు బుదు&ధడు. భార్య, కుమారుని వదిలిపెట్టాడు. తిరిగి తిరిగి కట్టకడపటికి ఏ మహనీయుడు నా హృదయానికి సంబంధించిన సత్యాన్ని బోధిస్తాడా అని విచారము చేస్తూ వచ్చాడు. కానీ, వారు చెప్పేది ఒకటి, చేసేది మరొకటిగా కనిపించింది. వీరితో నాకు మోక్షము కలగదు. అన్నింటినీ వదలి నదీ తీరం చేరుకున్నాడు. ఒక వట వృక్షం క్రింద కూర్చున్నాడు. ఏది నిజము, ఏది నిజము కాదు అని ఈవిధంగా విచారిస్తూ వచ్చాడు. కట్టకడపటికి గుర్తించాడు. 'సర్వం దుఃఖం దుఃఖం, సర్వం అనిత్యం అనిత్యం, సర్వం శూన్యం శూన్యం' అన్నాడు. అన్నీ కనిపిస్తున్నాయిగానీ విచారణ చేస్తే యివేమీ కనిపించవు. ఇవి సత్యాలు కాదు. కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవు కదా! కలలో వుండినంత వరకు అన్నీ సత్యములుగానే కనిపిస్తాయి. కలలో పాము కరచింది. కలలో ఏడుస్తావు. ఏడుపు ఎప్పుడు నిల్చిపోవాలి? నిద్రనుండి లేపినప్పుడు ఏడుపు వెంటనే నిల్చిపోతుంది. నిద్రనుండి లేపాలి. ఈ ప్రపంచమనే జీవితములో మీరు నిద్రిస్తున్నారు. ఈ నిద్రలో సర్వానుభూతులు క్షేమంగా వుండినట్లుగా, మధురంగా వుండినట్లుగా అనుభవిస్తున్నారు. కానీ, ఇక్కడ కొన్ని కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ కష్టాలకు నీవు యోచన టేస్తున్నావు. ఎప్పుడు విమోచన అవుతుంది? నిద్రనుండి లేచినప్పుడు ఇదంతా అనిత్యము, శూన్యము అని సరైన ఆదర&శము నిరూపించినప్పుడే ఈ నిద్రనుండి మేల్కొంటారు. ఈ చిన్న వయస్సునుండి, start early, drive slowly, reach safely. ముక్తికి తగిన ప్రయత్నం చేయాలి. ఏ బంధన లేకపోయినా ఆకలి నిన్ను బాధపెడుతున్నది కాదా! ఆకలి నుండి నిన్ను విముక్తి చేయాలి. ఆకలికూడా ఒక బంధనే. డబ్బు కావాలి. దరిద్రుడుగా వున్నావు. ఈ దరిద్రముకూడా ఒక బంధనే. దరిద్రము పోతేగానీ నీకు క్షేమం కలగదు. అది కావాలి, ఇది కావాలి అని పెద్ద అజ్ఞానములో మునిగావు. అజ్ఞానముకూడా బంధనే. ఈ అజ్ఞానమునుండి నన్ను దురము చేయి. ఈ రోగమునుండి నన్ను దూరము చేయి. ఈ ఆకలినుండి నన్ను దూరము చేయి. దరిద్రమునుండి నన్ను దూరము చేయి. ఇవన్నీ బంధనలే. ఇవన్నీ వుండినంత వరకు ఆనందము చిక్కదు. బంధవిమోచన అయినప్పుడే ఆనందము ప్రాప్తిస్తుంది. రోగము వుండినంత వరకు దుఃఖము పీడిస్తుంది. రోగము నివారణ అయినప్పుడు ఆనందము కల్గుతుంది. నివారణ నిమిత్తము చేసేవన్నీ ముక్తులే. సాధనలు చేస్తున్నాం. ఏమిటి కారణము? సాధన అంటే చెడ్డను వదలి మంచిని పట్టుకోటమే. దుఃఖమును వదలి ఆనందమును అందుకోటమే సాధన. చీకటినుండి వెలుగుకు చేరుకోటమే సాధన. దీనినే ఉపనిషత్తులందు, 'అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతం గమయ'. అసత్యములోనున్నంత వరకు సత్యము చిక్కదు. సత్యములో వెదకినా అసత్యము లెక్కచేయదు.

దేనిని లెక్కచేయకుండా పోతుందో దానినే గురువుగా తీసుకోవాలి. సత్యము మనకు తెలుస్తే అసత్యమును ఏమాత్రమూ లక్ష్యము చేయము.

సత్యం నాకు కావాలి. సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం. దీనికి చిన్న ఉదాహరణ. ఒకానొక సమయంలో కపిలదేశ మహారాజు పండితులనందరిని పిలిచి ప్రశ్నిస్తూ వచ్చాడు. ఒక్కొక్కరు ఒక్కొక్క జవాబు చెబుతూపోయారు. కానీ, మహారాజుకు తృప్తి కలగలేదు. 'అందరూ చెబుతున్నారు, నాకు అర్థము కావటం లేదు. నీవు దానికి సరైన జవాబు చెప్పగలవా?' అని తన స్వంతదేశ పండితిని అడిగాడు. 'నేను చెప్పగలననే ధైర్యము లేదు' అన్నాడు. అతన్ని వెనక్కి పంపించాడు. వచ్చిన పండితులను అడగటము వారిని వెనక్కు పంపించటము. ఈవిధంగా జరుగుతూ వచ్చింది. పండితులంటే పెద్ద గ్రంథాలు చదివినవారు, వేదశాస్త్ర ఇతిహాస పురాణాలు చదివిన వారు, అర్థాలు బోధించే వారు, వీరు కాదు. రాజు చేస్తున్న మూర్ఖ చేష్టలు ఒక గొల్లవాడు తెలుసుకున్నాడు. పెద్ద కంబళి భుజముపై వేసుకొని మహారాజు దగ్గరకు పోయాడు. 'ఎందుకురా నీవు వచ్చావు?' అన్నాడు. 'మహారాజా! మీరు ప్రశ్నలు అడుగుతున్నారుట. ప్రతి ఒక్కరూ త్రోవలో పోయేవారు మిమ్మల్ని విమర్శిస్తూ పోతున్నారు. నేను జవాబు చెప్పగలను' అన్నాడు. 'చెప్పగలవా?'. 'చెప్పగలను' అన్నాడు. 'చెప్పకపోతే నీ తల తీస్తాను' అన్నాడు. 'తల కాదు ఏమైనా చేయి. చెప్పగలను' అన్నాడు ధైర్యంగా. ఎదురుగా కూర్చున్నాడు. రాజు ప్రశ్న అడిగాడు. 'మహారాజా! మీరు ప్రశ్న అడిగేవారు. నేను జవాబు చెప్పేవాడను. జవాబు చెప్పేవాడు పెద్దవాడు. ప్రశ్న అడిగేవాడు చిన్నవాడు. నీవు తెలుసుకోవాలని అడుగుతున్నావు. కాబట్టి చిన్నవాడవు. జవాబు చెప్పేవాడు నేను పెద్దవాడు. మీ డ్రస్సు నాకివ్వండి. నా డ్రస్సు మీరు వేసుకోండి. మీ సింహాసనంపై నేను కూర్చుంటాని. నా వలె మీరు క్రింద కూర్చొని ప్రశ్న వేయండి'. మహారాజు డ్రస్సు వానికి వేశారు. సింహాసనంపై కూర్చోపెట్టారు. మహారాజు క్రింద కూర్చున్నాడు. సింహాసనంపై కూర్చున్న గొల్లవాడు అడుగుతున్నాడు,' మహారాజా! నీ ప్రశ్న అడుగు'. మహారాజు ప్రశ్నించాడు. 'భగవంతుడు జగత్తులో చేసే పని ఏమిటి?' చక్కని జవాబిచ్చాడు, 'కూటిపేదను కోటీశ్వరునిగా చేస్తాడు. కోటీశ్వరుని కూటిపేదగా చేస్తాడు. ఇంత వరకు నేను కూటిపేదగా వున్నాను. ఇప్పుడు రాజుగా వున్నాను. కూటిపేదగా కంబళి భుజముపై వేసుకొని నీవు కూర్చున్నావు. ఇదే భగవంతుడు చేసే పని'. సరే! కొంతవరకు మనస్సుకు తట్టింది.రెండవ ప్రశ్న, 'భగవంతుడు ఎవరిని చూస్తాడు? ఎవరిపై అనుగ్రహ దృష్టి కలుగుతుంది?' ఒక దీపము చూపించాడు. 'మహారాజా! ఈ దీపము వెలుగుతున్నాది. ఇది ఎటువైపు చూస్తున్నాది?' 'అన్నివైపులా చూస్తున్నాది' 'జ్యోతిస్వరూపుడైన భగవంతుడు అన్ని దిక్కులూ చూస్తుంటాడు. ఒకవైపు మాత్రమే చూడడు'. ఇది మహారాజుకు తృప్తి కలిగించింది. ఇంక మూడవది వేశాడు. మూడవ ప్రశ్నకు కొంత సందేహించాడు గొల్లవాడు. ఎలాంటిది వేస్తాడో యేమోనని. అడిగాడు, 'స్వామీ!' గొప్ప మర్యాద కలిగింది, 'స్వామీ! మూడవ ప్రశ్న అడగదలుచుకున్నాను. భగవంతుడు ఎక్కడుంటాడు?' ఒక కప్పులో పాలు తీసుకు వచ్చాడు. ఆ పాలలో వెన్న ఎక్కడుందో చెప్పగలవా అని అడిగాడు. 'ఆ పాలలో ప్రతి ఖణమున, ప్రతి అనువున వెన్న వుంటున్నాది' అన్నాడు మహారాజు. కాబట్టి భగవంతుడు సర్వత్రా వుంటున్నాడు. కనిపించాలంటే పాలను ఏమి చేయాలి? పాలను కాచి, తోడంటు వేసి పెరుగు చేయాలి. పెరుగు చిలకాలి. చిలికే సమయంలో వెన్న పైకి వస్తుంది. అదేవిధంగా భగవంతుడు సర్వత్రా వుండిన వానిని హృదయములో ప్రవేశింప చేసుకొని భక్తిప్రపత్తులతో వేడిచేసి, దివ్యత్వమనే తోడంటువేసి, సాధనతో చిలికినప్పుడే సాక్షాత్కారమనే వెన్న వస్తుంది'. తృప్తి పడ్డాడు మహారాజు. అప్పుడు ఇతనికి రాజ్యము సగభాగము యిచ్చి నిత్యజీవితములో యిలాంటి పవిత్రమైన వాటికి జవాబు చెప్పే పామరుడే చాలా గొప్పవాడు అన్నాడు. పాండిత్యము వుండటం గొప్పతనము కాదు. తెలివితేటలలో విశ్వాసపూర్ణమైన దానిలో జవాబు చెప్పటమే నిజమైన లక్ష్యము.

ఈనాడు పోజిటివ్, నెగిటివ్ అంటే ఏమిటో ఎంత చదువుకున్నవానికైనా అర్థముకావటము లేదు. మనస్సు ప్రవేశించినదంతా నెగిటివ్. ఏదానిని చూచి మనస్సు వెనక్కు తిరుగుతుందో అదే పోజిటివ్. మనస్సు ఆకర్షించేదంతా నెగిటివ్. అయితే ఆ నెగిటివ్ ఆకర్షించినప్పుడు కూడా దానిలో ప్రతిఫలము లేకుండా ప్రవేశించు. అదికూడా

పోజిటివ్ అవుతుంది. నీవు డాక్టరు. పేషెంటును చూడాలి. ఒక ఫలితముతో నీవు చూడటం లేదు. పేషెంటు బాధ నివారణ కావాలి అనే ఉద్దేశ్యముతో చూడు. అది పోజిటివ్ అవుతుంది. కాబట్టి, డాక్టరుకా, మందులు యిచ్చుకో. ఏమి చేసినా పోజిటివ్‌గా తయారుకావాలంటే ప్రతిఫలాపేక్ష లేకుండా చూచుకోవాలి. ప్రతిఫలము కోసము ప్రాకులాడుతున్నప్పుడు నెగిటివ్‌గానే రూపొందుతుంది. ప్రతిఫలము అపేక్షించకు. నీకు కావలింది బాధపడేవారి బాధ నివారణ కావటమే. అదే పోజిటివ్‌గా తయారౌతుంది. ప్రపంచములో చిన్న విద్యార్థి మొదలుకొని పెద్ద పండితుని వరకు నిత్యజీవితములో చేయవలసినవి నిర్వర్తించటమే నిజమైన పోజిటివ్. వ్యక్తిత్వము దూరం చేయాలి. నీ యొక్క దివ్యత్వమును ప్రవేశింప చేసుకోవాలి. ఈనాటి మానవుడు తనయందున్న మానవత్వమునే గుర్తించుకోలేక పోతున్నాడు. ఇంక మానవత్వమందున్న దైవత్వమును ఏరీతిగా గుర్తించగలడు? తనయందున్న మానవత్వమునే తెలుసుకోలేనివాడు తనయందున్న దైవత్వమును ఏరీతిగా తెలుసుకోగలడు? మొట్టమొదట నీయందున్న మానవత్వమును నీవు గుర్తించుకో. అప్పుడు దివ్యత్వము తప్పక తెలుస్తుంది. ఈనాడు నెగిటివ్ నేచర్‌లో వుంటున్నాము. పోజిటివ్ నేచర్‌గా రావాలి. అది మన నేచర్‌గా వుండాలి. నేచర్ అంటే ఏమిటి? నిత్యజీవితంలో కనిపించేదంతా నేచరే. కానీ, ఇది పోజిటివ్ నేచర్‌గా నీవు చూడు. సర్వం విష్ణుమయం జగత్‌గా రూపొందుతుంది. నీవు కర్మలు విడిచిపెట్టనక్కరలేదు. నీవు చదువు విసర్జించనక్కరలేదు. ఉద్యోగములు మననక్కరలేదు. స్వంథ పని చేసుకో. అన్ని పనులు చేసుకో. ఏ పనియందు దోషము లేదు. కానీ, మంచి భావముతో చేయి. పవిత్రమైన హృదయముతో నీవు చేయి. హృదయము పవిత్రముగా పెట్టుకొన్నప్పుడు అన్నీ పవిత్రముగానే జరుగుతూ వుంటాయి. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము నాల్గింటియందు మనస్సు ఒక్కటే వుండేది. మనస్సు వాంఛలతో లేకుండా చేసుకున్నప్పుడు అన్నీ పోజిటివ్‌గానే రూపొందుతాయి.

నిజంగా మీరు నమ్ముతారో నమ్మరో కానీ, కొంతమంది నమ్మవచ్చు, నమ్మకపోవచ్చు. నా దేహము వుంది. నా మనస్సు వుంది. నా బుద్ధి వుంది. నా అంతఃకరణ వుంది. అన్నీ వున్నాయి. మీ వలె నాకు వున్నాయి. కానీ, నేను వేటినీ టచ్ చేయను. మనస్సు వుంది అది మంకీమైండ్ అని తెలుసును. దానియఇక్క ప్రభావమునకు నేను ఏమాత్రమూ లొంగను. అది దాని సహజము. వస్తుంది, పోతుంది. mind is like monkey. body is water bubble. I do not want mind. I do not want body. I want only coscience. నా దేహము స్పర్శ అనేదానిలో ఎంతో పోజిటివ్ వుంటున్నది. ఎక్కడైనా దేహము తాకండి. అక్కడంతా పోజిటివ్. నాకు నెగిటివ్ భావములు రావు. అయితే కొంతమంది మనస్సు మార్చే నిమిత్తము యిట్లా చేయవద్దు, అట్లా చేయవద్దు అని అరుస్తుంటానేగానీ, అరుపు చక్కచేయటానికే. నాకు 72 సంవత్సరములు. అయినప్పటికీ, ఇంత ప్రపంచములో ఒక్క వాంఛ నాలో లేదు. ఏనాడూ అది కావాలి, ఇది కావాలి అనే ఆశ లేదు. ఏ సమయములో అలాంటిది రాలేదు. చిన్న ఉదాహరణము. క్షణక్షణమునకు నా జీవిత రహస్యములు చాలా విచిత్రముగా వుంటాయి. రాత్రి నా రూములో యిద్దరు పిల్లలు పండుకుంటారు. ద్వారము దగ్గర పండుకుంటారు. ఎందుకంటే ద్వారము తెరవటానికి, వేయటానికి వారిని పెట్టుకున్నాను. మీ కందరికీ తెలుసు. రాత్రి ఒకటిన్నర గంటలకు తలుపులు తెరిచాను. మీరు వెళ్లిపొండి అన్నాను. వారు చెప్పేందుకు భయపడుతున్నారు. అప్పటికే స్నానం చేశాను. డ్రస్సు వేసుకున్నాను. జుట్టు అణగిపోయిందికదా అని దాన్నంతా సరిచేసుకున్నాను. వారు ఎందుకు భయపడుతున్నారు? ఆ కార్యం వేరే జరిగింది. వారు క్రిందకు పోయి నిల్చుకున్నారు. వారు క్రిదకుపోయి పడుకోవాలి. నేను తక్షణమే క్రిందకు పోయాను. నేను వచ్చేటప్పటికి క్రిందనున్న వారిని లేపి అందరూ నిల్చున్నారు. వారు బాధ పడుతున్నారు. ఎందుకోసం స్వామి యిట్లా చేశారు? చిన్న ఉదాహరణ చెబుతున్నాను. మీరందరూ ఈ విషయం జాగ్రత్తగా చూచుకోవాలి. ఈ దేహము 95 సంవత్సరములు వరకు వుంటుంది. అన్నాను. నిజమే. అవసరమైతే 95 కాదు 100 సంవత్సరములు వరకు వుంటాను. కానీ, నాకు ఈవిధమైనవి కొన్ని యిష్టము లేకుండాపోతే ఏ నిముషములోనైనా ఈ దేహాన్ని వదలవచ్చు. ఈ రెండూకూడా నా కంట్రోలులో వున్నాయి. సాయిబాబా 95 అన్నాడే ఇట్లా అయిపోయిందే అనుకుంటే ప్రయోజనం

వుండదు. ఏ నిముషములోనైనా పోవచ్చు. ఏ నిముషములోనైనా పెంచుకోవచ్చు. ఈ స్వాతంత్ర్యము నాకుంది. అందువలనే నేను కొన్ని సమయములందు యిలాంటివి చేస్తుంటాను. మరొక పదహైదు దినముల ముందు లేచాను. పడ్డాను. పెద్ద స్తంభము, రగ్గులు పెట్టుకొనేది. నలుగురు పిల్లలుకూడా దానిని తోయలేరు. అది పడింది. అప్పుడు 11 గంటలు. అదే కాకుండా జగ్గులోని నీళ్ళన్నీ నాపై పడ్డాయి. స్వామి పిచ్చిపిచ్చిగా చేస్తున్నాడే అని వాళ్ళు అనుకుంటారని నాకు తెలుసు. పడేటప్పటికి ఒక పిల్లవాడు వచ్చి నన్ను లేపాడు. ఇంకొకడు వచ్చి దాన్ని ఎత్తాడు. దినము ఏదో ఒకటి జరుగుతున్నాది. రాత్రంతా నిద్రించేకోసం దేహము తీసుకోటం కాదు. బయట పనిగానే వుంటుంది. పోజిటివ్ పనే. నిజంగా స్తంభము పడితే ఎంత ప్రమాదము కల్గాలి. ఎట్లైనా నాకేమీ పరవాలేదు అన్నాను. అంగీ తడిసిపోయింది. నెగిటివ్ భావములు లేవు. తడిసిన దానితోనే తిరిగి పండుకున్నాను. పెద్ద రగ్గు వేశారు. రగ్గు తీసేస్తున్నాను. నాకు నెగిటివ్, పోజిటివ్ లేదు. సమత్వంలో వుంటున్నావీ. ఈవిధముగా ప్రతిరోజూ ఏదో ఒకటి జరుగుతూనే వున్నది. ఒక దినము సాయంకాలము పిల్లలను పిలిచి చెప్పాను, 'చూడండి. నా భావములు వేరుగా వుంటాయి. నేను ఎక్కడెక్కడకో పోతుంటాను. ఏమాత్రం యోచన చేయకండి. ఒక్కొక్క సారి తలుపు తెరచుకొని వెళ్ళిపోతుంటాను. ఇలాంటివికూడా జరుగుతుంటాయి. ఎప్పుడంటే అప్పుడు స్నానంచేస్తుంటాను. దేనినో తీసి పారవేస్తుంటాను. పిచ్చి పట్టి కాదు. వాంఛలు లేవు. నా పోజిటివ్ కోరికలు ఆవిధంగా వుంటున్నాయి. పరులకోసం చేసే పనులు. నేను ఏ పని చేసినా పోజిటివ్ పనులేగానీ నెగిటివ్ పనులు ఒక్కటీ లేదు. ఈ దేహమును టచ్ చేసినప్పుడు అంతా పోజిటివ్‌గానే వుంటుంది.

ఈవిధంగా నేను చెప్పేది, చేసేది రెండూ ఒక్కటే. ఇప్పుడే కాదు. ఈ దేహమునకు 9 సంవత్సరమునుండి అన్నీ ఈవిధముగానే టేస్తున్నాను. ఈ గ్రామములో కరణము వుండేవాడు. సుబ్బమ్మ భర్త. అతను ల్యాండ్ లార్డ్. చుట్టూ వుండే భూములన్నీ అతనివే. అతన్ని చూస్తే అందరూ భయపడిపోయేవారు. కరణం పిలుస్తున్నాడంటే అదురుతూ పోయేవారు. నేను ఇప్పుడే యింత ఎత్తు. తొమ్మిది సంవత్సరములకు యింకా చిన్నగా వున్నాను. పిల్లలందరిని పిలిచేది. అతను చాలా చెడ్డ ప్రవర్తనలో వుండేవాడు. ఆ పాటలంతా వ్రాసి, పిల్లలతో పాడిస్తూ, అతను బృందావనం ముందు కూర్చున్నప్పుడు అతని ముందు పాడుకుంటూ పొమ్మని చెప్పేవాడిని. 'స్వామీ! కరణం కొడతాడో ఏమో!' అన్నారు. 'మిమ్మల్ని కొట్టటానికి అతనికి అధికారము లేదు. నా పాటలు మీరు పాడుతున్నారు. పోజిటివ్ భావములు. సత్యాన్ని బోధించే సమయములో ఎవరు మనలను నిందించటానికి, బాధించటానికి అధికారము లేదు'. బాగా పిల్లలకు నేర్పించాను. మంచి రాగము. చక్కగా ప్రాక్టీసు చేసి పాడుకుంటూ పోతున్నారు. ఆ పిల్లలకు అర్థము తెలియదు. మొదటి దినము లేచి లోపలకు వెళ్ళిపోయాడు కరణం. రెండవ దినము అడ్డముగా నిల్చొని పాడుతున్నారు. లోపలికి పోయి మామిడిపండు జ్యూస్ యిచ్చి, ఈ పాట మీరు పాడవద్దండి' అన్నాడు. 'మీకు ఎవరు నేర్పించారు' అని అడిగాడు. 'రాజు నేర్పించాడు' అని చెప్పారు. రాజు ఈ పనులంతా చేస్తున్నాడా అని ఒక దినము నన్ను టిఫిన్‌కి రమ్మన్నాడు. 'నాకు టిఫిన్ అక్కరలేదు' అన్నాను. చిన్నపిల్లవాడు యింత గట్టిగా మాట్లాడుతున్నాడే అని అతనికి చాలా కోపం వచ్చింది. ఆనాటి పరిస్థితులకు తగిన బుద్ధి నేను నేర్పేది. పాట వ్రాసాను.

వింటగత్తెల చెంతబోకు ఖండితముగ కదు నీచుడౌతావు
కులము వారలు నిను కుండ ముట్టనివ్వరు
బంధువులు నిను చూస్తె బయటకెళ్ళగొడతారు
స్నేహితులు నిను చూస్తె చెప్పుతో కొడతారు.

ఈవిదంగా పాడుతుంటే చాలా భయపడిపోయేవారు పిల్లలు. ఆనాటి పరిస్థితిలో యిలాంటి పదములే వారికి వుపయోగపెట్టాలి. ఈవిధంగా చక్కచేసే నిమిత్తము కొన్ని వ్రాతలవల్ల, పాటలవల్ల, నాటకములవల్ల జగత్తులో మార్పులు తెప్పిస్తూ వచ్చాను. నేను చేయందే చెప్పను. నేను చేస్తాను. ఇది మంచిదని చెబుతాను. కానీ, ఏది చేసినా పోజిటివేగానీ నెగిటివ్ కాదు. నాకు ఏ వాంఛలూ లేవు. పిల్లలందరూ నా ప్రోపరిటీ అన్నాను.

ఇప్పుడుకూడా ఒక పిల్లవాడు స్వామి ప్రోపరిటీ అన్నాడు. నిజమే. అందరూ నా ప్రోపరిటీయే. కానీ, ప్రోపరిటీలో విలువైనవి, విలువ లేనివి వుంటున్నాయి. కొన్ని భూములుంటాయి, విలువైనవి. దానికి ముండ్లకంచె వేస్తారు. ఆ ముండ్లకంచె నా ప్రోపరిటీయే. మంచి వుంటున్నాది, చెడ్డా వుంటున్నాది. అయితే విద్యార్థులు నా ప్రోపరిటీగీ వుండినప్పుడు మంచివారుగా తయారుకావాలి. ఆదర్శమునందించే విద్యార్థులుగా తయారుకావాలి. ముండ్ల ప్రోపరిటీగా తయారుకాకూడదు. బండలు ప్రోపరిటీలుగా తయారుకాకూడదు. కొండల వలె తయారుకావాలి. అలాంటి వారుగా తయారు కావాలి కనుక, ఈ విద్యార్థులను పట్టి తగిన తర్ఫీదు యిస్తున్నాను.

చాలామంది విద్యార్థులు నా తత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. వారి స్థితి అట్టిది. వారి స్థాయికి తగినట్లుగా అర్థమవుతూ వుంటుంది. ఏనాటికైనా నా స్థాయికి వచ్చాక గుర్తించుకుంటారు. కానీ, ఒక్కటి మాత్రం మీరు గుర్తించాలి. నాలో కాలిమొదలు తలవెంట్రుక వరకు నెగిటివ్ భావాలు లేవు. నెగిటివ్ డిజైర్సు లేవు. ఇంక దోషము ఎట్లా వస్తుంది? అంతా పోజిటివ్. అయితే పరులకు నేర్పే సమయంలో నెగిటివ్ రూపొందింప చేస్తారు. ఈవిధంగా స్వామియొక్క తత్త్వము చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి. ఎన్నో పర్యాయములు చెప్పాను. ఎక్కువ మాట్లాడకండి. talk less more work. కానీ, ఎవరూ అనుసరించటం లేదు. కొంమంది పిల్లలు చెబుతారు. 'తల్లిదండ్రులు పెండ్లి చేసుకోమని చెబుతున్నారు' అని. పెండ్లి చేసుకోవద్దని చెప్పను. మీకు ఇష్టమైతే తప్పక చేసుకోండి. ఎవరిని వద్దని చెప్పను. అయితే యిష్టము లేకుండా వుంటే నేను ఫోర్సు చేయను. బలవంతముతో పెండ్లిండ్లు చేయకూడదు. నీకు యిష్టమైతే తప్పక చేసుకో. నేను ఫేర్సు చేయను. స్వామి చెప్పలేదని స్వామిపై వేస్తారు. ఈవిధముగా స్వామిపై వేయకూడదు. నీకు యిష్టమైతే చేసుకో. తప్పక ఆశీర్వదిస్తాను. కానీ, స్వామి వల్లపఎడ్లి నిలచిపోయిందనే పేరు రాకూడదు. ఎవరు ఏ పని చేయవలసి వచ్చినప్పటికీ చేసుకోవచ్చు. తప్పు లేదు. కానీ, మొట్టమొదట నీ concience ని ప్రశ్నించుకో is it good or bad. is it right or wrong. అని ప్రశ్నించుకొని నీ concience నుండి వచ్చిన జవాబు నీవు అనుసరించు. నీ concience నీ master. follow the master . face the devil, fight to the end, finish the game. ఒకే మాటగా వుండాలి. రెండు నాలుకలుండేది పాము. విషజంతువు. మనకున్నది ఒకటే నాలుక. నీవు కోరుకున్నది నీకు బంధన అయిపోతుంది. ప్రాకృత విషయములలో నీవు ప్రవేశిస్తున్నావు. ప్రాకృతమైన పనులు నీవు చేయి తప్పులేదు. కర్తవ్యము నిర్వర్తించి పనిచేయి. భార్య వుంటున్నది. ఆమెను సంతోషపెట్టు. పిల్లలుంటున్నారు. వారిన పోషించు. వారికి చదువు చెప్పించు. వారికి పెండ్లిచేయి. సరైన స్థితిలో పెట్టు. వీటన్నింటిని వద్దని చెప్పను. ఒక కర్తవ్యము నీపై వుంటున్నది. నీవు ఏది మంచిది కాదనుకుంటావో అది పిల్లలకు బోధించకు. ఈనాడు నీవు చెడ్డ అంటున్నావు. పిల్లలకు చెడ్డనే బోధిస్తున్నావు. నీకు మంచి అంటున్నావు. పిల్లకు చెడ్డ అంటున్నావు. ఇది చాలా దోషము. ఇతీ మంచిది కాదు. ఇది ఎవరు చేశారు?ధృతరాష్ట్రుడు చేశాడు.

ఒకానొక సమయంలో ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్లాడు విదురుడు. ధృతరాష్ట్రుడు తన కుమారులంచా మరణించారని బాధపడుతున్నాడు. ముందు ఎంత చెప్పినా ధృతరాష్ట్రుడు వినలేదు. 'అన్నా! ఈనాటికైనా నీ దోషము గుర్తించుకున్నావా? ఒక్క చెడ్డవానిని దూరముచేసి వుంటే 99 మంది పిల్లలు బాగుపడి వుండేవారు. ఆనాడే చెప్పాను. దుర్మార్గుడైన కుమారుని దూరము చేయమన్నాను. ఒక్క దుర్యోధనుని దూరము చేస్తే మిగిలినవారు సుఖపడతారని అన్నాను. నీవు విన్నావా? వినలేదు. నేను ఎప్పుడూ ధర్మమునే చెబుతున్నాను. ఈ రాజ్యమంతా పాండురాజుది. అతడు మరణించిన తర్వాత ఆ పిల్లలు నీ దగ్గరకు వచ్చారు. అతని రాజ్యము నీవు హస్తగతము చేసుకొని ఆ పిల్లలు నివసించటానికి ఒక గ్రామముకూడా యివ్వలేదు'. ఆనాడే చెప్పాడు విదురుడు, 'నీవు నెమళ్ళను, జింకలను విడచి చిరుతలను, పులులను పెంచుకుంటన్నావు. కౄరమృగములను పెంచుకుంటున్నావు. ధర్మజుడు, అర్జునుడు, భీముడు, నకులుడు, సహదేవుడు యిలాంటి నీవు పెంచటం లేదు. నీకు తప్పక ప్రమాదం జరుగుతుంది. పుత్రవాత్సల్యం గొప్పగా పెంచుకుంరున్నావు'. పుత్రవాత్సల్యం వుండవచ్చుగానీ ధృతరాష్ట్ర పుత్రవాత్సల్యం వుండకూడదు. ధృతరాష్ట్రపుత్రవాత్సల్యం ఏమి టేసింది? రాజ్యమునే నాశనం చేసింది. నూరుమంది కుమారులను కోల్పోయాడు. కనుక, మంచి మాటలు చెప్పినప్పుడు చాలావరకు యింపు కాదు.

మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన
చెడ్డమాట ముందు చెవిని పడును
ఇట్టివారు నన్ను ఎరుగంగనేర్తురే
ఎట్టి తెలివియున్న ఏమి ఫలము?

ఏమి చదివి ఏమి ఉపయోగము? మంచి మాటలు విన్నప్పుడు తగిన రీతిగా పోషించుకోవాలి.

స్వామిని మీరు తెలుసుకున్నా తెలుసుకొనకపోయినా స్వామికి ఎట్టి వాంఛలూ లేవు. ఎవరినీ దేనినీ అడగటం లేదు. నా చేయి యిచ్చేదేగానీ పుచ్చుకొనేది కాదు. ఒక్క దానికి మాత్రం చేయి యిట్లా చాపుతాను. ప్రేమ, ప్రేమ. ఆ ప్రేమ ఎవరిది? అదికూడా నా ప్రోపరిటీయే. ప్రేమయే భగవంతుడు. ప్రేమలో జీవించు. భగవంతుని భావములు చాలా పవిత్రమైనవి. ఇలాంటి భావములను మీరు గుర్తించుకొన లేక మీ భావములతో పోల్చుకుంటారు. దాని వల్ల నా భావములు మీకు చెడ్డవిగా కనిపిస్తుంటాయి. నాలో చెడ్డ ఏ కోశములోనూ లేదు. 'God's breath is our breath' ఈవిధంగా మీరు భావించినప్పుడే మీరు అన్ని విషయములందు క్షేమాన్ని పొందగలరు. ఎంత చెప్పినా వినకుండా కొంతమంది పిల్లలు పాడౌతుంటారు. పాడైపోయినవారు బయటకుపోయి ఎన్నో అవస్థలకు గురౌతున్నారు. ఉన్న మీరైనా మంచి మాట విని ప్రవిత్రమైన మార్గములో ప్రవేశించి నెగిటివ్ భావములు రాకుండా చూచుకోండి. తల్లిదండ్రులను ఏమాత్రమూ బాధపెట్టకండి. మాతృదేవోభవ, పితృదేవోభవ. వారిని ఏవిధముగానూ హింసించకూడదు. అయితే వారికి చక్కగా మీరు బోధించి మీ హృదయాన్ని విప్పి వారిని సంతృప్తి పరచటానికి ప్రయత్నించండి. explain చేస్తే వారుకూడా అర్థం చేసుకుంటారు. వారు ఏమిచెప్పినా నో అంటే అది మొండితనమౌతుంది. నా వుద్దేశ్యము ఇది అని మంచిగా చెప్పు. తీయని మాటలతో చెప్పి వారిని మార్చండి. నీవు సరైన మార్గానికి తెప్పించి తృప్తిపరచు. నీకు తల్లిదండ్రులే చాలా ముఖ్యము. అయితే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ అని అనేకమంది దేవుళ్ళున్నారు. ఆచరించ బోధించేవాడు ఆచార్యుడు. ఆచరించకుండా బోధిస్తే ఆచార్యుడు కాదు. టీచరు.

ఒకానొక సమయంలో మీరా భర్తను విడచిపెట్టవలసి వచ్చింది. ఎంత కాలమో భరించుకుంది. కానీ, అతని హింసను భరించుకోలేకపోయింది. జుట్టు పట్టి బయటకు లాగేశాడు రాణా. కృష్ణమందిరమునకు తాళము వేశాడు. నా మందిరములో వుండటానికి వీలు లేదు, బయటకు వెళ్ళమన్నాడు. చాలా బాధ కలిగింది. 'అయ్యో! నా కృష్ణుని వదలిపెట్టి పోవటమా!' అనకుంది. అక్కడకూడా నెగిటివ్ భావాలు వచ్చాయి. తక్షణమే పోజిటివ్ భావాలు బయలుదేరాయి. 'ఇది మహారాజు కట్టిన మందిరము. నా హృదయ మందిరము ఎవరూ కట్టినది కాదు. నా ప్రభువు కట్టినదే. హమారా దిల్ తుహ్మారా మందిర్. కృష్ణా! నా హృదయమే నీ మందిరము' అని. తులసిదాస్‌కు ఒక జాబు వ్రాసింది. తులసిదాస్ ఆమె కాలమువాడే. ఏమిని? 'ప్రభుజీ! నాకు ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. భర్తను వదలిపోవటము స్త్రీకి సరైనది కాదు. పతియే దైవమనే భారతీయ సంస్కృతికి విరుద్ధముగా పోవలసి వచ్చింది. ఈ విషయములో ఏమి చేయమంటారు?' అంది. ఆయన జవాబు వ్రాసాడు. 'అమ్మా! మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, పతిదేవోభవ అని చెపాపవ్రీ. తల్లి నిమిత్తమై ఎంతో శ్రమ పడ్డాడు భరతుడు. కానీ, రాముని అరణ్యమునకు పంపిన తర్వాత ఆ కుమారుడు కూడా తల్లి మాటను ధిక్కరించాడు. తల్లిని హింసించాడు'. దీన్ని జ్ఞాపకము చేశాడు. ఇతరులకు అపకారము చేస్తే మనము సహించుకోవచ్చు. భరించుకోవచ్చు. భగవంతుని బాధించటంలో యివన్నీ తక్కువ అన్నాడు. దైవం కోసం ఏమిటేసినా తప్పు కాదు. దైవమే నీకు కావలసినది. శ్రీరామచంద్రుడు అడవికి పంపించినందులకు ధిక్కరించాడు తల్లిని తప్పులేదు. పితృదేవోభవ. ప్రహ్లాదుడు. హిరణ్యకశిపుడు భగవంతుని నిరంతరము దూషిస్తూ వచ్చాడు. నారాయణ నామము ఉచ్చరించకూడదు. దైవద్వేషిగా వుంటున్న నీ తండ్రిని ధిక్కరించు తప్పులేదు. గురువు. బలిచక్రవర్తికి శుక్రాచార్యుడు గురువు. అప్పుడు బలిచక్రవర్తి చెప్పాడు, ' పలికి బొంకుటకంటె పాడి వున్నె' దైవానికి నేను ఇస్తానని చెప్పినప్పుడు మానటానికి వీలులేదు. గురువు

ఆజ్ఞను ధిక్కరిస్తానని గురువాజ్ఞ ధిక్కరించాడు. ఇలాంటివన్నీ దైవము పట్ల మాత్రమే ప్రత్యేకంగా చూచుకోవాలి. దైవ విషయములో ఏది వచ్చినా ఫరవాలేదు. నీవు ఏమాత్రమం భయపడనక్కరలేదు. ఇలాంటి విషయాల్లో మన జీవితాన్ని ధైర్యంఘా ముందుకు నెట్టుకొని పోవాలి. ఆ జాబు చూచింది. బయలుదేరింది ద్వారకకు. ఇంథకంటె నాకు ఆనందమేమున్నది! తప్పక సత్యమైన మాట. దైవ విషయములో నేను ఏమాత్రమూ విచారించను. దైవము కోసం నా సర్వస్వమూ త్యాగము చేస్తాను. తప్పుకాదని భర్తను వదలి వెళ్లిపో.తీంది. ఆమె వెళ్లిన తరువాత మహారాణా చాలా విచారించాడు. నేను చాలా తప్పుపని చేశాను అని అనుకున్నాడు. తానుకూడా గుఱ్ఱముపై త్వరగా వెళ్ళాడు. ఆయన ద్వారం దగ్గరకు వెళ్లేటప్పటికే ఆమె ప్రాణం విడిచింది. చూచారా! అనుబంధము అంతవరకే వుంది. దైవాన్ని చూచింది. ప్రానం విడిచింది. తిరిగి పతి ముఖమే చూడలేదు. సత్యమైన మార్గంలో విజయాన్నే సాధిస్తూ వచ్చారుగానీ అపజయాన్ని ఏనాడూ అందుకోలేదు.

దైవవిషయములో ఎలాంటి యిక్కట్లు వచ్చినా తట్టుకొని, నెట్టుకొని ముందుకు పోవాలి. నా వెంట నా తత్త్వము చక్కగా తెలుస్తునిది. కానీ, నేను ఎవరినీ వెంట పెట్టుకోను. ఎందుకంటే వారు సరిగా అర్థము చేసుకోలేరు. అయితే అక్కడ రాత్రి పండుకొనక తప్పదు. పండుకుంటున్నారు. వారు ఇవన్నీ చూస్తున్నారు పాపం. ఏమీ నాతో చెప్పటం లేదు. చెప్పినట్లు చేస్తున్నారు. పో అంటే పోతున్నారు. తిరిగి రా అంతే వస్తున్నారు. భయపడిపోతుంటారు పాపం. చాలా మంచి పిల్లలు. స్వామి తత్త్వము ఏమిటో అర్థము చేసుకోలేకుండా పోతున్నారు. నేనే వారికి చెబుతుంటాను. 'నాయనా! ఇట్లా వుటుంది. నేను ఎప్పుడూ నెగిటివ్ భావములతో వుంధను. పోజిటివ్ భావములతో వుంటాను' అని చెప్పాను. పూర్వము రాముడు అరణ్యములో వుంటుండి ఏమి చేశాడో తెలుసునా? పోజిటివ్‌ను ప్రదర్శింప చేశాడు. లక్ష్మణునకు తెలుసు. సీత అనుసరిస్తూ పోయింది .దైవాన్ని అర్థము చేసుకునే వ్యక్తులు చాలా తక్కువమంది వుంటారు. ఏది చెప్పినా మీ మంచికోసమే నేను చెబుతున్నాను. ఏది చేసినా మీ మంచికోసమే చేస్తున్నాను. ఆ సత్యము మొట్టమొదట గుర్తించుకోండి. ఏదీ మీరు నాకు యివ్వనక్కరలేదు. మీకోసం ఏది కావలసినా నేను యిస్తాను. జీవితమును నిముషములో మీకు యిస్తాను. కానీ, మీనుండి ఏమీ నేను కోరను. ఆ సత్యాన్ని మీరు గుర్తించి మీరు మంచిగా వుండండి. దేశానికి ఆదర్శమునందించండి. ఫలానా కాలేజి పిల్లలనే చక్కని ఆదర్శమునందించాలి. ఆవిధంగా మీరు ప్రవర్తిస్తారనే ఉద్దేశ్యంతో వున్నాను. బర్త్‌డే అని యింత కప్పులో బియ్యం తీసుకువస్తుంటారు అక్షింతలు. వాటితో ఆశీర్వాదము చేయాలి. సరిగా తెలుసుకోండి. హయ్యర్ సెకండరీ పిల్లలుగానీ, కారేజీ పిల్లలుగానీ చక్కగా గుర్తించుకోండి. నా ఆశీర్వాదమునకు అక్షింతలు అక్కరలేదు. చాలామంది అన్నము లేక అల్లాడిపోతుంటే అక్షింతలకు యిన్ని బియ్యం వేస్టు చేయటమెందుకు? వేస్టు చేయకూడదు. ఏదీ వేస్టు చేయకూడదు. నాకు, మీకు మనస్సుతో కలసిన సంబంధమేగానీ ప్రాకృతమైనది కాదు.

నెగిటివ్, పోజిటివ్ భావములను మీరు సరిగా అర్థము చేసుకోండి. నెగిటివ్ భావములు దూరం చేసుకోండి. హృదయానికి హృదయమే సాక్షి. ఆవిధమైన సంబంధం పెంచుకుంటూ రండి. అప్పుడు నేను మీరే, మీరు నేనే అవుతాము. ఈవిధంగా మనం మారిపోవచ్చు. చాలా గొప్ప పని. మీరందరూ కొన్ని ప్రాకృతమైన విషయాల లోపల, తల్లిదండ్రులు చెప్పినా లేక బంధుమిత్రులు చెప్పనప్పటికీ నెగిటివ్ విషయములలో మీరు విచారము చేసుకొని దిగండి. ఏది నెగిటివ్ అంటే మనస్సు ప్రేరేపించేది నెగిటివ్. కోరికలు అన్నీ నెగిటివ్. కానీ, divine desires నెగిటివ్ కాదు. positive ఎట్లంటే డివైన్ చాలా పెద్దది. దాని కొలత యినిత అంత అని చెప్పలేము. దాని పరిమితము యిట్టిదిని చెప్పలేము. అనంతము. అగాధము. అదియే immortality అన్నారు. నెగిటివ్ అంతా immorality . ఇవన్నీ మనం దూరం చేయాలి. అప్పుడే immortality చేరుతుంది. కోపము, తాపము, ఈర్ష్య, అసూయ వీటన్నింటిని దూరము చేసుకోవాలి. అరిషడ్వర్గములు కామ, క్రోధ, లోభ, మద, మత్సరములు సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టక వక్రమమైన మార్గములో ప్రవేశపెడుతున్నారు. దానివలనే దుఃఖమునకు గురైపోతున్నాము. క్రోధము చెడ్డదికాదు. ద్వేషము చెడ్డది కాదు. ద్వేషముండాలి. దేనిపైన? భావమునకు విరుద్ధమైనదానిపై ద్వేషము పెట్టుకోవాలి. దైవానికి

విరుద్ధమైన వాటిపై ద్వేషము పెట్టుకోవాలి. అది నిజమైన గొప్పదనము. అప్పుడు అదికూడా పోజిటివ్ అవుతుంది. ఉపకారము చేయటానికి, మంచి పని చేయటానికి ఏది అవసరము వస్తుందో అది అంతా పోజిటివ్. స్వార్థ భావముతో వున్నప్పుడు అది నెగిటివ్. స్వార్థమును దూరం చేయాలి. అప్పుడే సరైన మానవత్వము పోషించుకున్నవారమౌతాము.

విద్యార్థులారా! ఎక్కడైనా సరే మీ జీవితము లోపల వ్యక్తిత్వమునకు చోటివ్వకండి. కర్తవ్యమునకు విలువ యివ్వకండి. duty is God, work is worship. నీ డ్యూటీకి విలువ యివ్వాలి. నేను ధనవంతుడనే, నేను విద్యావంతుడనే అనే ప్రమాణములు తీసుకోకూడదు. ఈ బంధనకు మనం లొంగకూడదు. పొంగి, కృంగని దివ్యత్వమును మనం పొందాలి. పిల్లలు చదువుకోసం వచారు. చక్కగా చదవండి. చదివిన దానిని చక్కగా అర్థము చేసుకోండి. అర్థము చేసుకున్న దానిని పదిమందికి పంచండి. పదిమందికి పంచి మీరు కూడా అనుభవించండి. ఎక్కడికి పోయినా, ఏ ఉద్యోగములో చేరినా ఆ ఉద్యోగమునకు తగిన పని మీరు చేయాలి. నీ ఉద్యోగమునకు తగిన జీతము వాళ్లు యిస్తున్నారు. ఆ జీతమునకు తగిన పని మనంచేయాలి. నీకు నీవు విచారించుకోవాలి. నేను దీనికి తగిన పని చేస్తున్నానా లేదా. దానికి తగిన పని చేసినప్పుడే పోజిటివ్ అవుతుంది. లేకపోతే అదికూడా నెగిటివ్ అయిపోతుంది. ఇలాంటి చిన్నచిన్న విషయాలలో పోజిటివ్, నెగిటివ్ తెలుసుకోటానికి వీలవుతుంది. ఈ ధనము మనము ఎక్కడనుంచి సంపాయించాము? సమాజమునునిడి సంపాయించాము. తిరిగి సమాజమునకే ఉపయోగపెట్టాలి. ఈ సమాజమునకు మనము ఉపయోగపెట్టినప్పుడు అది పోజిటివ్ అవుతుంది. ఆవిధమైన త్యాగభావముతో జీవించుటకు ప్రయత్నము చేయాలి. అందువలనే వేదము చెప్పింది, 'నకర్మణా నప్రజయా త్యాగేనైకే అమృత్తవమానసుః' అప్పుడే హృదయము పవిత్రమైపోతుంది. దయాహృదయుడై జీవిస్తావు. నీ హృదయము విశాలమైపోతుంది. దయగల హృదయమే దైవమందిరమైపోతుంది. మీ హృదయము దైవమందిరముగా మార్చుకోండి. దైవభావముతో దైవముగా జీవించుటకు పూనుకోండి. ఎవరినీ నొప్పించక, బాధించక, తప్పించుకు తిరిగే ఉపయాన్ని వెతుక్కోండి. అదే జీవితముయొక్క లక్ష్యము. అదే ఆధర్శవంతమైన జీవితము. అదే నిజమైన సాలోక్య జీవితము. నిత్యజీవితములోనే సాలోక్యము వుంది. నిత్యజీవితములోనే సాయుజ్యము వుంటున్నది. అద్వైతమును నీవు ఆనంధముగా తలచుకుంటే అదే నీకు సాయుజ్యముగా మారిపోతుంది. సాధనలతోను, భజనలతోను మీరు తృప్తి పడకండి. భజనలో ట్యూన్సు వేసేదానికంటె నీ హృదయములో తగిన భావములు అభివృద్ధి పరచుకో. నీ మృగభావాలు దూరము చేసుకో. నీ పశు భావములు దూరము చేసుకో. నీ కఠిన భావములు శిరము చేసుకో. నీ దుర్భావములు దూరము చేసుకో. ఇదే భజన చేసినందుకు సరైన గుర్తు. ఒక ప్రక్క భజన చేస్తూ కూర్చోటం. దుర్భావములు, దుచ్చింతలు, దురాలోచనలు లోపల నింపుకుంటూ కూర్చుంటే ఇంక భజన చేసి ప్రయోజనము ఏమిటి? ఇలాంటి భజన చేసి ప్రయోజనము ఏమిటి? ఇలాంటి భజన కేవలం ఒక నెగిటివ్ భజనే అయిపోతుంది. కేవలం టేపురికార్డు మాదిరి తయారౌతుంది. ఆదర్శము నిరూపించాలి. పాటలు పాడిన భావాలంతా మన హృదయములో ప్రింటైపోవాలి. అప్పుడే నీవు, నీ హృదయము రెండూ ఒక్కటైపోతాయి.

ఇలాంటి భావాలు పిల్లలు పెంచుకుంటే నాకెంతో ఆనందము. ఇలాంటి పిల్లలు దేశములో ప్రవేశించి ఎంతో ఆదర్శముగా మీరు జీవితాన్ని గడపవచ్చు. నేను ఇంతగా మిమ్మల్ని దగ్గర చేర్చి, ఇన్నివిధాల పోషించి, ఇన్నివిధాల చదువు చెప్పించి ఆదరించినందుకు నాకు కావలసింది అది ఒక్కటే. మీరు మంచి పేరు తెచ్చుకోండి. అంతకంటె నాకు ఏమీ అక్కరలేదు. మీరు మంచి పేరు తెచ్చుకుంటే మీ తల్లదండ్రులకు ఆనందము. అదే నాకు ఆనందము. అంతకంటే నాకు యివ్వవలసిన ఆనందము లేదు. నేను ఏదీ కోరటంలేదు. ఈవిధముగా మీరు జీవించి ఆదర్శవంతులుగా రూపొందాలి. ఈవిధమైన జీవితాన్ని గడపాలని ఆశిస్తూ, ఆశీరావదిస్తూ నా దీర్ఘప్రసంగాన్ని విరమిస్తున్నాను.

నా విషయంలో మీరు జాగ్రత్తగా వుండావి. నేను ఏ విషయంలోనూ నెగిటివ్‌గా తయారుకాను. ఎలాంటి పరిస్థితిలోనూ నెగిటివ్ కాను. ఎప్పుడూ నేను పోజిటివ్. దేనికి నేను సిద్ధము? పెడార్థమునకు చోటివ్వకుండా, అనర్థానికి చోటివ్వకుండా యదార్థమును మనస్సులో పెట్టుకొని దివ్యత్వమును దర్శించండి. అదే నేను కోరేది. మీ

యందున్న మానవత్వమును మొట్టమొదట తీసుకోండి. పశుత్వము చూడకండి. ఆ మానవత్వమునుండి దైవత్వములో ప్రవేశించాలి. పెద్దలను గౌరవించండి. ఎవరు మనకు మేలు చేశారో వారు చేసిన మేలు మరచిపోకూడదు. help ever, hurt never. ఇదే భారతదేశముయొక్క ప్రధాన సూత్రము. కెవలము వేదములు, శాస్త్రములు చదివి ప్రయోజనము లేదు. గొర్లకాపరి వచ్చి మహారాజును సంతృప్తిపరచాడు. కాబట్టి ఇది పండితులతో జరిగేది కాదు. పండితులతో జరిగేవి కేవలం వాదోపవాదములే. ఈ వాదోపవాదములవల్ల ద్వేషము పెరిగిపోతుంది. వైరము పెంచుకోకూడదు. తెలియనప్పుడు వాదము చేయవద్దు. నోరుమూసుకొని కూర్చో. అంతే చాలు. ఈనాడు నీవు తెరవవలింది హృదయాన్ని. మూటవలసింది నోరును. కానీ, నోరు తెరచుకుంటున్నాం, హృదయాన్ని మూసేస్తున్నాం. అదే పెద్ద నెగిటివ్. హృదయాన్ని తెరవాలి. నోరును మూయాలి. అదే నిజమైన పోజిటివ్. ఆవిధమైన పోజిటివ్ జీవితాన్ని గడపటానికి ప్రయత్నం చేయండి. ఎక్కువ మాట్లాడకండి. ఎవరినీ బాధపెట్టకండి. ఈవిధమైన మంచి మాటలతో మీ జీవితాన్ని ఆదర్శంగా నిరూపిస్తారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

మ్యూజిక్ పిల్లలు చాలా జాగ్రత్తగా వుండాలి. ఎంత పాడుతున్నారో అంత భావములు మార్చుకోవాలి. ట్యూన్స్‌తోబాటు హృదయభావములు మార్చుకోవాలి. హృదయములో మంచి భావములు లేకుండా, బయట మంచి గంభీరంగా పాడినా అది నాకు వినటానికి యిష్టము వుండదు. హృదయము మంచి చేసుకొని ఏవిధముగా పాడు అది నాకు ఆనందము. హృదయాన్ని పరిశుద్ధము చేసుకుంటే రాగతాళములు వాటంతటవే వస్తాయి. ఒకానొక సమయంలో కబీరు చెప్పాడు, 'రామా! నేను యోగాభ్యాసము చేయలేకపోతున్నాను. ధ్యానము సల్పలేకపోతున్నాను. జపము నేను చేయలేకపోతున్నాను. ఈ పాంచభౌతిక శరీరము అనేక రోగములతో నిండి వుంటున్నది. దీనివల్ల నేను చేరలేను. ఒక్కటి మాత్రం నా దగ్గర వుంటున్నాది. దానితో నీవు తప్పించుకొనుటకు వీలుకాదు. దానితో నిన్ను కట్టివేస్తాను. ఎట్లా అనుకన్నావో యేమో? నా దగ్గర ప్రేమ పాశం వుంటున్నది. ఆ ప్రేమ అనే త్రాడుతో నిన్ను కట్టివేస్తాను. అప్పుడే రాముడు ప్రత్యక్షమయ్యాడు. 'నాయనా! నేను చిక్కేది దానికి మాత్రమే. ఇంకో దానికి చిక్కను' అన్నాడు. అదే నాకు కావలసిన తాడు. ఇదే ఒకవిధమైనన గుణము. గుణము అంటే త్రాడు అని అర్థము. ఆ ప్రేమతో ఏదానినైనా సాధించవచ్చును. ప్రేమను పెట్టుకోండి. ప్రేమను అభివృద్ధి చేసుకోండి. ప్రేమమయులు కండి. ప్రేమయే మీరైపొండి. అదే ప్రేమమయంగా జీవితమైపోతుంది. పాటలు పాడుతుంటే రాగతాళములు పోతున్నాయని ఏమాత్రమూ యోచన చేయకండి. ప్రేమ లోపల పెట్టుకొని పాట పాడండి. అది సరైన శృతికే వస్తుంది. పరీక్ష చేయండి. ప్రేమ లేకుండా ప్రయత్నము చేస్తే అపస్వరమే వస్తుంది. ప్రేమ పెట్టుకొని చేయండి. శృతిలయతాళములు చేరిపోతాయి.